క్లుప్తంగా

ఘనంగా ప్రీస్కూల్ ప్రగతి మేళా



ఊట్కూరు: మండలంలోని బిజ్వార్‌లో గురువారం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ ప్రగతి మేళా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా చిన్నారులు పాటలు, నృత్యాలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ప్రతిభ కనబర్చిన చిన్నారులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సావిత్రమ్మ, ఎంపీటీసీ హనుమమ్మ, సూపర్‌వైజర్ గీత, అంగన్‌వాడీ టీచర్‌లు యశోద, మాణిక్యమ్మ, భాగ్యమ్మ, శ్వేత, వార్డు సభ్యులు గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలపై అవగాహన

మాగనూర్: బ్యాంక్ సేవలపై ప్రజలకు అవగాహన ఉండాలని ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్ అన్నారు. మక్తల్ మండలంలోని మాద్వార్‌లో గ్రామీణ వికాస్ బ్యాంక్ చిన్నపొర్ల ఆధ్వర్యంలో గురువారం మొబైల్ ఇంటర్నెట్ బ్యాంకింగ్ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ ఆఫీసర్ మాట్లాడుతూ బ్యాంక్ సేవలు, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి సురక్ష మిత్ర, జీవన జ్యోతి, అటల్ బీమా పింఛన్ యోజన, రూపే కార్డులు వల్ల కలిగే ప్రయోజనాలు తెలిపారు. సురక్షితమైన డిజిటల్ లావాదేవీలతో సమయం ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది కార్తీక్, సురేష్, సర్పంచ్ , ఎంపీటీసీ, బ్యాంకు మిత్ర గుడిసె రాజు పాల్గొన్నారు.

ఘనంగా మౌలాలి దర్గా ఉత్సవాలు



మరికల్: మండలంలోని ఎలిగండ్ల శివారులో గురువారం ఘనంగా మౌలాలి దర్గా ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు దర్గాకు కొత్త దట్టీలు కట్టి పూజలు చేశారు. అనంతరం ఉత్సవాలను వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉస్సేన్, కతల్, ఖాజపాష, మహ్మద్ పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం

ధన్వాడ: మండల కేంద్రంలోని లక్ష్మీవాడ కొచ్చ గుడి ఆలయంలో గణపతి, అమ్మవారు, నాగుల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ పునర్నిర్మాణం అనంతరం విగ్రహ ప్రతిష్ఠాపన ఏర్పాట్లు చేశారు. గురువారం ప్రతిష్ఠాపన, అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు కెంచె భాస్కర్, కావలి వెంకట్రాములు తెలియజేశారు. గ్రామస్తులు అందరూ పాల్గొని బ్రహ్మసూత్రలింగ దర్శనం చేసుకోవాలని కోరారు.

టీడీపీ బలోపేతానికి కృషి



నారాయణపేట టౌన్: ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలో ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వినయ్ మిత్రయాదవ్ మహంకాళీ మందిరంలో పూజలు నిర్వహించారు. అనంతరం 20వ వార్డులో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో గడప గడపకు తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో పేదలకు సంక్షేమ ఫలాలు అందాయన్నారు. కార్యక్రమంలో శివకుమార్, మనోహర్, రామకృష్ణ, ఆవుటి వీరన్న, శ్రీకాంత్, గోపి, వీరన్న పాల్గొన్నారు.

కోస్గి: దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చేసిన సేవలు, చంద్రబాబు చేసిన అభివృద్ధితో తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వెంకట్ ప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ పేరుతో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రవి, మల్లేష్, వెంకటయ్య, జనార్దన్ పాల్గొన్నారు.

పేటలో తేలికపాటి వర్షం

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో గురువారం సాయంత్రం తేలికపాటి వర్షం కురిసింది. ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై చిన్నపాటి గాలితో కూడిన వాన కురిసింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

మెరుగైన ఫలితాలు సాధించాలి

కోయిల్‌కొండ: రానున్న పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు చదువుపై శ్రద్ధ కనబర్చాలని డీఈఓ యాదయ్య అన్నారు. గురువారం మండలంలోని పారుపల్లి, కోయిల్‌కొండ ఉన్నత పాఠశాలలను సందర్శించారు.

గుట్టలను మింగేస్తుండ్రు!

- అడ్డు వచ్చిన చెట్ల తొలగింపు
- చదును చేసిన స్థలాలను కబ్జా చేస్తున్న అక్రమార్కులు



తొలగించిన చెట్లు



మందిపల్లిలో బృహత్ పల్లెప్రకృతి వనం వద్ద గుట్టలో నుంచి తరలించిన మట్టి

ధన్వాడ: మండలంలో ఎక్కడ చూసిన అక్రమార్కులు ఎర్ర మట్టి గుట్టలను మాయం చేస్తున్నారు. గుట్టల నుంచి అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తూ కొంతమంది తమ జేబులను నింపుకుంటుంటే.. అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో జోగుతున్నారు. గట్టల నుంచి మట్టిని తరలించే క్రమంలో అడ్డువచ్చిన చెట్లను నరికి వేస్తూ ఎవరికి కనపడకుండా ఉండేందుకు వాటిని తగులబెడుతున్నారు. ఒక వైపు ప్రభుత్వం హరితహారం కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తుంటే మండలంలో మాత్రం పచ్చదనాన్ని నామరూపాలు లేకుండా బూడిద చేస్తున్నారు. గుట్టల్లో ఎన్ని వేల మొక్కలు నాటినా జేసీబీల కాటుకు బలి అవుతూనే ఉన్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా మట్టిని జేసీబీలతో తరలిస్తున్నారు.

మందిపల్లిలో..

మండలంలోని మందిపల్లిలో బృహత్‌పల్లె ప్రకృతి వనం, పల్లె ప్రకృతి వనం వద్ద రెవెన్యూ ఫారెస్ట్ గుట్టలు ఉన్నాయి. బుధవారం రాత్రి జేసీబీలతో చెట్లను తొలగించి గుట్టను తవ్వి మట్టిని తరలించారు. ఇలా తరలించిన మట్టిని మరికల్‌లో ఏర్పాటు చేస్తున్న ప్రైవేట్ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో వేస్తున్నారు. ఉచితంగా మట్టిని తరలిస్తూ ట్రిప్‌కు రూ.5 నుంచి రూ.7వేల వరకు అమ్మకాలు జరుపుతున్నారు. గుట్టను తవ్వి మట్టిని తరలించడంతో ఇక్కడ రెండు ఎకరాల వరకు స్థలం చదును అయింది. దీన్ని గ్రామానికి చెందిన కొందరు కబ్జా చేస్తున్నారు. ఇలా ధన్వాడ మండలంలో రోజు ఏదో ఒక్క గుట్టల నుంచి ఎర్రమట్టిని, రాయిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. చదును చేసిన స్థలంలో ప్రభుత్వ స్థలం అంటూ బోర్డును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సింగారంలో కంటివెలుగు శిబిరం



సింగారంలో..

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారంలో కంటి వెలుగు శిబిరం గురువారం కొనసాగింది. ఇప్పటి వరకు 466మందికి పరీక్షలు నిర్వహించగా 91మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. మరో 105మందికి దగ్గరి చూపు లోపం ఉండటంతో అద్దాలను ఆర్డర్ చేశామని వైద్యులు తెలిపారు. ఈ నెల 23 వరకు శిబిరం కొనసాగుతుందని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, కేంద్రానికి వచ్చే సమయంలో ఆధార్‌కార్డు తీసుకుని రావాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీవిద్య, ఆర్థోమెట్రిస్ట్ హరీష్, హెల్త్ అసిస్టెంట్ గోవింద్‌రావు, డాటా ఎంట్రీ ఆపరేటర్ స్నేహలత, ఏఎన్ఎం తిరుపతమ్మ, ఆశావర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటివెలుగు

ధన్వాడ: మండలంలో కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతుంది. మండల కేంద్రంలో పూర్తవడంగా మందిపల్లిలో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించారు. గ్రామస్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆసుపత్రి సిబ్బంది సూచించారు.

రెండేళ్లు గడిచినా అందని బిల్లులు

దామరగిద: రెండేళ్ల క్రితం నాల్గో విడత పల్లె ప్రగతిలో భాగంగా చేపట్టిన పనులకు బిల్లులు చేయకుండా పీఆర్‌ఏఈ వేధిస్తున్నారని యల్సన్‌పల్లి సర్పంచ్ దేవిక పరిపూర్ణం గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పల్లె ప్రగతిలో భాగంగా అధికారుల ఆదేశాలతో వైకుంఠధామానికి మట్టి రోడ్డు నిర్మాణానికి 1.28 లక్షలు సొంత నిధులతో పనులు చేశానన్నారు. కమ్యూనిటీ టాయిలెట్ల నిర్మాణానికి రూ.54 వేలు, రూ.45 వేలతో ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేసినా బిల్లులు మంజూరు కావడంలో జాప్యంతో ఇబ్బందులు పడుతున్నానని వాపోయారు. దాదాపు రూ.2.5 లక్షల బిల్లులకు టెక్నికల్ సమస్యల పేరుతో బిల్లులు చేయడం లేదని, తమను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని అసహనం వ్యక్తం చేశారు. పలుసార్లు విన్నవించినా పెడచెవిన పెడుతున్నాడని వాపోయారు. పీఆర్‌ఏఈ నర్సింగ్‌రావు తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే బిల్లులు చెల్లించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఘనంగా తిర్మలనాథస్వామి ఉత్సవాలు



తిర్మలాపూర్‌లో నవగ్రహపూజలో పాల్గొన్న భక్తులు

నారాయణపేట రూరల్: మండలంలోని తిర్మలాపూర్ శివారులోని తిర్మలనాథస్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఆంజనేయస్వామి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, బొడ్రాయి ఏర్పాటు కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ముందుగా ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, అర్చన, అలంకరణ, హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠాపనలో జల, ధాన్యదివాసం తదితర పూజలు చేశారు. భక్తుల కోలాహలం మధ్య ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేపూరి రాములు, సర్పంచ్ అంజమ్మ, ఎంపీటీసీ బస్సప్ప, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌బాబు, గ్రామ పెద్దలు నారాయణరెడ్డి, బాలకిష్టయ్య, సూర్యనారాయణ, గోవింద్‌రెడ్డి, తిరుపతి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రంగారెడ్డి పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



ధర్నా చేపడుతున్న వీఓఏలు

నారాయణపేట టౌన్: మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందడానికి సహకరిస్తున్న వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలని తెలంగాణ ఐకేపీ వీఓఏ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద నిర్వహించిన ధర్నాలో వీఓఏలు ప్లకార్డులను ప్రదర్శిస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజుల పాటు సమ్మెలో ఉండనున్నారని పేర్కొన్నారు. అర్హులైన వీఓఏలను సీసీలుగా గుర్తించాలని, సాధారణ బీమాతో పాటు ప్రమాద బీమా రూ.10 లక్షలు చేయాలని డిమాండ్ చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నారాయణపేట: సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి అందజేశారు. నారాయణపేట పట్టణానికి చెందిన గడ్డం చిన్నతమ్మకు రూ.20 వేలు, గోవిందమ్మకు రూ.34,500, నక్క జయమ్మకు రూ.60 వేలు, మండలంలోని మేకహనుమాన్‌తండాకు చెందిన గణేశ్‌నాయక్ రూ. 20 వేలు, అభంగపూర్ జక్కం శేఖర్ రూ. 60 వేలు, గొల్ల నర్సమ్మకు రూ.17,500లకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్ రెడ్డి, జెడ్పీటీసీ అంజలి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేపూరి రాములు, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా చిట్టెం సుచరిత జన్మదిన వేడుకలు



గజమాలతో ఎమ్మెల్యే చిట్టెం దంపతులను సన్మానిస్తున్న నాయకులు

మాగనూర్(మక్తల్): ఉమ్మడి జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యురాలు చిట్టెం సుచరిత జన్మదిన వేడుకలను గురువారం మక్తల్ పట్టణంలోని వారి స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్ హాజరై ఎమ్మెల్యే దంపతులను గజమాల శాలువాతో సన్మానించారు. అనంతరం పడమటి ఆంజనేయస్వామి గుడి వద్ద అన్నదానం చేశారు. మక్తల్ సివిల్ ఆస్పత్రిలో పేదలకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, ఎమ్మెల్యే అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: రైతు సమన్వయ కమిటీ జిల్లా సభ్యురాలు చిట్టెం సుచరిత జన్మదినం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని క్షీరలింగేశ్వర ఆలయంలో బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విజప్పగౌడ, శివరాజ్‌పాటేల్, శివప్ప, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

మాడల్ పేపర్‌లు పంపిణీ



విద్యార్థులకు మాడల్ పేపర్‌లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఊట్కూరు: మండంలోని మిల్లత్ ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఐఎం ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు మాడల్ పేపర్‌లు అందించారు. బుధవారం రాత్రి ఆయా పాఠశాలలోని ఉర్దూ మీడియం విద్యార్థులకు అందజేసినట్లు ఆ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌ఆది, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదర్ తెలిపారు. కార్యక్రమంలో మిల్లత్ పాఠశాల కరస్పాండెంట్ మున్వర్ ఫారూకీ, మహ్మద్ కుర్షిద్, ఇస్మాయిల్, రఫీ, ఇక్తార్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


దామరగిద్ద: మండల బీఆర్ఎస్ నాయకుడు మధుసూదన్‌రెడ్డి తండ్రి నారాయణరెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి గురువారం సజనాపూర్‌కి వెళ్లి ఆయన భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. వీఆర్‌ఓగా ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఎమ్మెల్యేతో పాటు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్న జగదీష్, ఎంపీపీ నర్సప్ప, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, జెడ్పీటీసీ లావణ్య, రాములు తదితరులు ఉన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



మరికల్: మండలంలోని తీలేర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులు ఘనంగా స్వపరిపాలన దినోత్సవం వేడుకలను జరుపుకొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం హెచ్‌ఎం అనురాధ ఉపాధ్యాయులైన విద్యార్థులను అభినందించారు.

జక్లేర్‌లో..



మక్తల్: మండలంలోని జక్లేర్ సెక్టార్ పరిధి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. నాలుగు కేంద్రాలకు చెందిన చిన్నారులు ఉపాధ్యాయుల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో మక్తల్ ప్రాజెక్ట్ అధికారి సరోజిని మట్ట, గిరిజ, సూపర్ వైజర్ మహేశ్వరి, సర్పంచు నర్సిములు,, పారిజాతమ్మ, అంగన్‌వాడీ టీచర్లు రామేశ్వరి, మహేశ్వరి, ముంతాజ్, సుశీల, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మహమ్మదాబాద్: అనుమతులు లేకుండా రాత్రివేళలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గండేడ్ మండలంలోని సల్కర్‌పేట్‌కి చెందిన నల్ల తిరుపతయ్య అక్రమంగా ఇసుక వ్యాపారం చేస్తున్నాడు. ఇదే తరుణంలో గురువారం తెల్లవారుజామున వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నాడు.

దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ



బస్‌పాసులను పంపిణీ చేస్తున్న ఆర్‌టీసీ అధికారులు, ఎస్ఐ

కృష్ణా: మండలంలోని ముడుమాల్‌లో అర్హులైన దివ్యాంగులకు బస్‌పాస్‌లను గురువారం హైదరాబాద్ డిపో మేనేజర్ కృష్ణారెడ్డి, స్థానిక బీపీఎం తిమ్మయ్య, ఎస్ఐ విజయభాస్కర్‌లు అందజేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ మొత్తం 50 మంది దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లను పంపిణీ చేశామన్నారు. దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ తాయమ్మ, వెంకటేష్, నాయకులు వెంకటప్ప, మడుగు వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



విగ్రహాన్ని ధాన్యంతో కప్పి ధాన్యధివాసం చేస్తున్న అర్చకులు

కోస్గి: పట్టణంలోని తెలుగు వీధి, బీసీ కాలనీలో నిర్వహిస్తున్న నాభిశిలా(బొడ్రాయి) విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం రెండోరోజు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మంటపారాధన, సర్వతోభద్ర మంటపారాధన, లక్ష్మీ గణపతి హవనం , దేవీహోమం, విగ్రహాభిషేకం చేశారు. ప్రతి ఇంటి నుంచి తెచ్చిన ధాన్యంతో విగ్రహాన్ని పూర్తిగా కప్పి ఉంచి ధాన్యాధివాసం చేశారు. అనంతరం మంగళ హారతి, తీర్థప్రసాద వితరణ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మ్యాకల శిరీష దంపతులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు.

చిన్నారుల్లో పౌష్టికాహార లోపం అధిగమించాలి



ప్రీస్కూల్ మేళాలో పాల్గొన్న అధికారులు, చిన్నారులు

దామరగిద్ద: చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని అధిమించేందుకు అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలని సర్పంచ్ గిడ్డెలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రూప అన్నారు. గురువారం మండలంలోని కాన్‌కుర్తి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని మెనూ ప్రకారం చిన్నారులకు అందించాలని ఆదేశించారు. పూర్వ ప్రాథమిక విద్యతో పాటు ఆటపాటల ద్వారా చిన్నారుల మానసిక ఎదుగుదలకు కృషిచేయాలని సూచించారు. చిన్నారులు వివిధ వేషాధారణలో అలరించారు. కార్యక్రమంలో ప్రథమ్ సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ టీచర్లు అనంతమ్మ, స్వరాజ్యలక్ష్మి, లక్ష్మమ్మ, సూర్యకాంతం, అనురాధ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం



మాగనూర్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారి

మాగనూర్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రశాంతంగా ప్రారంభమైనట్లు సీఎస్ రేణుకాదేవి తెలిపారు. కళాశాలలో మొత్తం 81 మంది విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా.. 78 మంది పరీక్ష రాశారు. ముగ్గురు గైర్హాజరయ్యారు. నిమిషం ఆలస్యం నిబంధన ఉండటంతో విద్యార్థులు గంట ముందుగానే కేంద్రానికి చేరుకున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అత్యవసరంగా ఆరోగ్య సమస్యలు ఏర్పడితే వైద్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. సెంటర్ వద్ద మాగనూర్ ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేశారు.

మద్దూరు: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ మద్దిలేటి తెలిపారు. తెలుగు, హిందీ పరీక్షలకు 174 మంది రాయల్సి ఉండగా 171 మంది విద్యార్థులకు హాజరయ్యారు.

మేదరులను ఎస్టీలో చేర్చాలని వినతి

నారాయణపేట: మేదరి కులస్తులను బీసీ ఏ నుంచి ఎస్టీలో చేర్చాలని కోరుతూ గురువారం జిల్లా మేదర సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కోన రాజశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో మేదర కులస్తులు సైతం కదంతొక్కామన్నారు. ఉద్యమ వీరుడు సీఎం కేసీఆర్ పిలుపు మేరకు వెదురు తడకలతో చలువ పందిర్లు వేసి తమ కుటుంబాలతో కలిసి ఉద్యమంలో చాలా చురుకుగా పాల్గొన్నామని గుర్తుచేశారు. దేశంలో 28 రాష్ట్రాల్లో మేదరులు ఎస్సీ, ఎస్టీలుగా ఉన్నారని తెలంగాణ, ఏపీలోనే బీసీ ఏలో కొనసాగుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మహేంద్ర సంఘం నాయకులు చంద్రనారాయణ, పులి రాజన్న ఉన్నారు.

రేషన్ డీలర్ల మండల కమిటీ ఎన్నిక



మరికల్: మండల రేషన్ డీలర్ల నూతన అధ్యక్షుడిగా మరికల్ ముకుందరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం తహసీల్దార్ రాంకోటి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నూతన కమిటీని నియమించారు. ప్రధాన కార్యదర్శిగా జనార్దన్‌తో పాటు తదితరులు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మాజీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తెలిపారు.రవి, నర్సిములుగౌడ్, రాంరెడ్డి, నర్సిములు, సత్యారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

దర్యాప్తు చేయాలి

మరికల్: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీ కావడంతో లక్షల సంఖ్యలో నిరుద్యోగులు నష్టపోవాల్సిన పరిస్థితి దాపరించిదని బీజేపీ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, నాయకులు కొండయ్య అన్నారు. గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ పలు పరీక్షలకు సంబంధించిన పేపర్లు లీకై ఉంటాయని వారు అనుమానాలు వ్యక్తం చేశారు.

నారాయణపేట టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రకంపనం సృష్టిస్తున్న ప్రశ్న పత్రాల లీకులు వ్యవహారంపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేసి దానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని పీవైఎల్ అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వర్, ప్రతాప్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రం నుంచి పీవైఎల్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చలో ప్రగతి భవన్ ముట్టడికి తరలివెళ్లారు. పీవైఎల్ నాయకులు సలీం , ఇస్మాయిల్ ఉన్నారు.

‘పల్లె దవాఖానా’ వినియోగంలోకి తేవాలి



ధన్వాడ: మండలంలోని మందిపల్లిలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని త్వరగా ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు. పనులు పూర్తయిన ప్రారంభోత్సవం చేయకపోవడంతో నిరుపయోగంగా ఉందని, వెంటనే అధికారులు స్పందించి దవాఖానా ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మాదాసి కురువలకు న్యాయం చేయాలి



నిరసన చేస్తున్న మాదాసీకుర్వ సంఘం నాయకులు

ఆత్మకూర్: మాదాసి, మాదారి కుర్వలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి న్యాయం చేయాలని మాదాసి కుర్వ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్‌రాజు అన్నారు. గురువారం ఆత్మకూర్‌లో ఆసంఘం ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి కుర్వ డప్పుల మోతతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత రాజ్యాంగంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంచార జాతులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొన్నట్లు గుర్తు చేశారు. గొర్రెల కాపరులుగా సంచార జీవితం కొనసాగిస్తున్న తమ కుటుంబాలు దుర్భర జీవితాలను బతుకీడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మాదాసి, మాదారి కుర్వలకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇచ్చే విధంగా రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్లకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సింధూజకు అందజేశారు.